క్లుప్తంగా

నేడు చౌడేశ్వరి జాతర


అలంకరణలో చౌడేశ్వరి దేవి

ఖాజీపేట : కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా కొమ్మలూరు గ్రామంలోని చౌడేశ్వరి దేవి ప్రసిద్ధి. శనివారం అమ్మవారికి జాతరను నిర్వహించనున్నారు. ఒకరోజు జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలతో జాతర మొదలవుంది. అనంతరం ప్రత్యేక అభిషేకంతోపాటు సాయంత్రం జ్యోతుల ఉత్సవాలు జరుగనున్నాయి. జాతర పురస్కరించుకుని బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నారు. తొలి బహుమతి రూ.30,116 రెండవ బహుమతి రూ. 20,116 మూడవ బహుమతి రూ.10,116 నాల్గోవ బహుమతి రూ.5,116 అందజేయనున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు.

వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : హోమియోపతి వైద్యంతో ఆరోగ్యవంతులు అవుతారని డాక్టర్ సందీప్ తెలిపారు. స్థానిక మున్సిపల్ పార్కులో శుక్రవారం డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్‌తో పాటు ఏరియా మేనేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ మురళీమోహన్, మనోజ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి మాట్లాడుతూ ఐదు రోజుల సమ్మె కాలఒప్పందాల డిమాండ్లను పరిష్కరించాలని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఏపీఎఫ్ఆర్ఎస్ మున్సిపల్ కార్మికులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, గురమ్మ, రమాదేవి, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

కాశినాయన : మండలంలోని గొంటువారిపల్లె గ్రామానికి చెందిన వేములకోటపీరా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అతని వద్ద నుండి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

రేపు చిన్నమ్మ, పెద్దమ్మ దేవర

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కోటవీధిలో ఆదివారం చిన్నమ్మ, పెద్దమ్మ దేవర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది ఉగాది ముందు ఆదివారం దేవర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంతో పాటు పరిసరగ్రామాల నుంచి భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి చల్ల, కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. దేవర మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, దేవర ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు.

నేడు పల్లవోలులో ఫ్యామిలీ ఫిజీషియన్

చాపాడు: మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సచివాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ వద్ద శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలోని ప్రజలకు వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మధ్యాహ్నం 2 గంటల నుంచి గృహ సందర్శనలో భాగంగా ఇళ్లలో బెడ్‌కు పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు ఇంటివద్దే వైద్య పరీక్షలు చేస్తామని వైద్యాధికారి చెప్పారు.

అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు

బి.కోడూరు : మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి సజ్జ, జొన్న, పొద్దుతిరుగుడు, పెసర తదితర పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మండలంలోని ఐత్రంపేట, మేకవారిపల్లె, పెద్దుళ్ళపల్లె, ప్రభలవీడు, తిప్పరాజుపల్లె, బి.కోడూరు తదితర గ్రామాల్లో ఈ ఏడాది సజ్జ, జొన్న, పొద్దుతిరుగుడు, పెసర పంటలను విస్తారంగా సాగు చేశారు. పొద్దుతిరుగుడు, జొన్న పంటలు నూర్పిళ్ళు చేసి కలాల్లో ఉండగా కొన్ని పంటలు కోతదశలో ఉన్నాయి. రాత్రి కురిసిన వర్షానికి పొద్దుతిరుగుడు, జొన్న నేలవాలడంతో పాటు కలాల్లో ఉన్న జొన్నలు, పొద్దుతిరుగుడు విత్తనాలు తడవడంతో మార్కెట్‌లో తక్కువ ధర పలకడంతో నష్టం వాటిల్లినట్లు మండల రైతులు వాపోయారు. రెండు, మూడు రోజులు ఇలాగే వర్షం కొనసాగితే పంటలు నేలవాలి ఎక్కువ నష్టం వాలిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

కలెక్టర్ విజయరామరాజు



విద్యార్థినికి బహుమతి ఇస్తున్న కలెక్టర్ విజయరామరాజు

ప్రొద్దుటూరు : నేడు ఉద్యోగాలు చాలా ఉన్నాయని, అందుకు తగిన విధంగా విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజిలో శుక్రవారం నిర్వహించిన యువజనోత్సవ ఇన్నోవిట్స్-2023 కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ తాను చదువుకునే రోజుల్లో ఉద్యోగం సంపాదించడం చాలా కష్టంగా ఉండేదని పేర్కొన్నారు. నేడు ఉద్యోగాలకు కొదవ లేదని, అందుకు తగినట్లుగా విద్యార్థుల్లో నైపుణ్యం కొరవడిందన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లు కూడా అప్పుడే కొత్తగా వచ్చాయని, ఇన్‌కమింగ్ కాల్ కూడా నిమిషానికి రూపాయి చెల్లించాల్సి వచ్చేదన్నారు. నేడు అందరి వద్ద ఆండ్రాయిడ్ ఫోన్లు ఉన్నాయని, వీటిని విజ్ఞానాన్ని పెంచుకునేందుకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ మాజీ డైరెక్టర్ ఎ.పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ జీవితం పోరాటాలమయమని, అన్నింటినీ ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ఎంవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి హాజరైన 1000 మంది విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, స్పోర్ట్స్ కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖోలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందించారు. ప్రో గ్రాం సీడీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, కళాశాల కరస్పాండెంట్ జి.హుసేన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీ గోవర్దన్, హెచ్‌ఓడీలు కె.రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ ఎస్. సిద్దేశ్వరరెడ్డి, వి.నరసింహస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యసేవల నమోదు ఆన్‌లైన్ చేయకుంటే చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

ప్రొద్దుటూరు క్రైం : ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిర్వహించే వైద్య సేవలను తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ అన్నారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో జమ్మలమడుగు డివిజన్‌లోని ప్రైవేట్ వైద్యులకు హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టం, ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టం, ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ గురించి శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తే వారికి తప్పకుండా వైద్యం అందించాలని చెప్పారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని, అలాగే ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు కూడా తప్పకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆస్పత్రిలో జరిగిన జననాలను 24 గంటల్లోపు సివిల్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి జార్జ్, జిల్లా ఎపిడమాలజిస్ట్ ఖాజామోహిద్దీన్, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ ప్రతిమ, డిప్యూటీ డిమో రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఓలు జాకోబ్, హరి, డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్ కీర్తి పాల్గొన్నారు.

నీటితొట్లను శుభ్రంగా ఉంచుకోవాలి


ఉప్పలూరు గ్రామంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాశినాయన : ప్రజలు నీటి తొట్లను శుభ్రంగా ఉంచుకోవాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి నిర్మల తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పలూరు గ్రామంలో డ్రైడేలో భాగంగా గ్రామంలో పర్యటించి ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. వారానికి ఒకసారి నీటితొట్లను శుభ్రం చేసుకోవాలన్నారు. మురుగునీటి కాలువల్లో, నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లించారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్‌నర్సు శారద, ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత విద్య ఆవశ్యకతపై అవగాహన


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్

పోరుమామిళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి విద్యార్థుల అభ్యున్నతిపై చర్చించారు. ఉన్నత విద్య ఆవశ్యకత, డిగ్రీ అనంతర లక్ష్యం, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు, హాస్టల్ సదుపాయం, స్కిల్ హబ్ ఉపయోగాలు తదితర అంశాలపై వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, భౌతిక శాస్త్ర అధ్యాపకులు వెంకటరావు వివరించారు. కళాశాల అడ్మిషన్స్ గురించి తెలిపారు. విద్య ద్వారా విద్యార్థులు ప్రయోజకులు కావాలని, ఏదో ఒక వృత్తిలో స్థిరపడితేనే బతుకు సజావుగా సాగుతుందన్నారు. తల్లిదండ్రుల ఆలోచనలు, తమ బిడ్డలపై వారి కున్న ఆశలు తెలుసుకున్నారు. సమావేశంలో అధ్యాపకులు నరసింహారెడ్డి, రవిచంద్ర, మధు మాట్లాడారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చాపాడు : ఎరువులు, పురుగుల మందుల దుకాణాల యజమానులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాల అనుమతులు రద్దు చేస్తామని ఏడీఏ నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం సాయంత్రం బద్వేలు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు, వ్యవసాయ అధికారి మ్యాగీతో కలసి ఆకస్మిక తనిఖీలు చేశారు. సరకు నిల్వలు, అమ్మకం రిజిస్టర్లు, ధరలు నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు మాత్రమే ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. డీఏపీ ఎరువులు ప్రైవేటు దుకాణాలతో పాటు గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో కృత్రిమ ఎరువుల కొరత కల్పించినా, అధిక ధరలకు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుని అనుమతులను రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


కొర్రపాడు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

రాజుపాళెం : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని డివిజనల్ పంచాయతీ అధికారి విజయభాస్కర్, డివిజనల్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కొర్రపాడు, రాజుపాళెం, గాదెగూడూరు, వెలవలి, ఏరువపాలెం గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను శుక్రవారం వారు తనిఖీ చేశారు. అనంతరం సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించి అన్ని శాఖల ఉద్యోగులకు అప్పగించిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, మండల ఇన్‌చార్జి ఆర్ఐ అశోక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఆరోగ్య నిర్వహణ సమాచార వ్యవస్థ బాగుండాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ జిల్లా గణాంక అధికారి వి.జార్జి

ప్రొద్దుటూరు క్రైం : ఆరోగ్య నిర్వహణ సమాచార వ్యవస్థ బాగుండాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా గణాంక అధికారి వి.జార్జి పేర్కొన్నారు. ''ఆరోగ్య నిర్వహణ సమాచార వ్యవస్థ''లో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలందరూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప గణాంక అధికారులు జాకోబ్, హరి, వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, సూపర్ వైజర్ బీఏ వరప్రసాద్, ఫార్మసిస్ట్ శ్రీధర్, యూడీసీ మధు, స్టాఫ్ నర్స్ విజయమ్మ, సుబ్బమ్మ, సరోజ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ప్రసన్న పాల్గొన్నారు.

తెలుగువారు గర్వించదగ్గ రచయిత్రి మొల్ల


మొల్ల సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన

వైవీయూ : రామాయణాన్ని తెలుగువారందరికీ అర్థమయ్యేలా రచించిన కవయిత్రి మొల్ల మనజిల్లా వాసి కావడం మనందరికీ గర్వకారణమని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్ధన అన్నారు. శుక్రవారం వైవీయూ తెలుగుశాఖ, మొల్ల సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో మొల్ల సప్తశతజయంతి సభ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రతియేటా మొల్ల జయంతిని విశ్వవిద్యాలయం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వైఎస్ హయాంలో మొల్ల జయంతికి నిధులు కేటాయించి, అధికారికంగా నిర్వహించారన్నారు. ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష ఉన్నంతకాలం మొల్ల జనంలో జీవించి ఉంటారన్నారు. తెలుగు శాఖ ఆచార్యులు ఎన్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ తేనెరుచిలా మొల్ల రామాయణం ఉంటుందన్నారు. మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మొల్లపేరుతో సమావేశ మందిరం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. తిరుపతికి చెందిన శతావధాని డా. ఆముదాల మురళీ మాట్లాడుతూ 1440 మార్చి 13న కవయిత్రి మొల్ల జన్మించినట్లు కేంద్రప్రభుత్వం గుర్తించి ఆమె పేరుతో స్టాంపు విడుదల చేయడం గొప్ప పరిణామమన్నారు. అవధాని మాడుగుల శివశ్రీశర్మ మాట్లాడుతూ మొల్ల శ్రీకంఠమల్లేశ్వరుని వరం పొందినట్లు వివరించారు. పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ గోపవరంను మొల్ల మండలంగా ప్రకటించాలని కోరారు. అంతకు మునుపు మొల్లమాంబ పేరుతో విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్‌లో ఏర్పాటు చేసిన సమావేశ మందిరాన్ని వీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆచార్య పి. రమాదేవి, ఆచార్య జి. పార్వతి, డా. ఎం. వినోదిని, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, మొల్లసాహితీపీఠం ప్రతినిధి పార్వతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరుడి హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : స్థానిక మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్ధన్ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. 2022 నవంబరు 22 నుంచి నేటి వరకు ఆలయ హుండీ ద్వారా రూ. 1,03,436 లభించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సతీష్, శశిధర్, దక్షిణామూర్తి, సిబ్బంది సూర్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ ధీరేంద్ర జోషి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో తేజ టైల్స్ అండ్ శానిటరీ వేర్‌లో ఏపీలోనే మొదటి సారిగా ఏర్పాటు చేసిన కెరోవిట్ బై కజారియా వరల్డ్ షోరూంను శుక్రవారం కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ధీరేంద్ర జోషి ప్రారంభించారు. ఈ షోరూంలో బాత్‌వేర్‌కు సంబంధించిన నాణ్యమైన మెటీరియల్ లభిస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్ సాయిమనోహర్, ఏపీ రీజనల్ మేనేజర్ దేవరాజు, ఏరియా మేనేజర్ తిరుమల, తేజ టైల్స్ అండ్ శానిటరీ వేర్ యజమానులు కావలి కృష్ణతేజ, కావలి రఘు తేజ, కావలి విశ్వతేజ, భవన నిర్మాణానికి సంబంధించిన పలువురు మేస్త్రీలు పాల్గొన్నారు.

అక్రమ గృహ నిర్మాణదారులకు నోటీసులు

కడప కార్పొరేషన్: లే అవుట్లలో అక్రమంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 40వ డివిజన్ చౌటపల్లె, ఎస్‌బీఐ కాలనీల్లో ఆయన పర్యటించారు. కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి సెట్ బ్యాక్స్, ప్లాన్లు పరిశీలించాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. రెడ్డి కాలనీ నుంచి రైల్వేగేట్ వరకూ కాలువల్లో పూడిక ఎప్పటికప్పుడు తీసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌బీఐ కాలనీలోని పార్కులో చిన్నారులు ఆడుకొనుటకు ఎక్కువ స్థలం ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం జర్నలిస్టు కాలనీ పార్కును పరిశీలించి ఓపెన్ జిమ్, ప్లాట్‌ఫారమ్ మరమ్మతులు చేయించాలన్నారు. గాంధీ పార్కులో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు.

- గురువారం రాత్రి భారీ వర్షం కురిసిన నేపథ్యంలో రాత్రి 9.30 గంటలకు ఆయన నగరంలో పలు ప్రాంతాలను పరిశీలించి వర్షపునీరు ఎక్కడా నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ మాఫీ సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డీ మాఫీకి సంబంధించి ప్రభుత్వం గురువారం జీఓ ఎంఎస్ నంబర్ 34ను విడుదల చేసిందన్నారు. పట్టణంలో గృహాలు, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ భవనాలకు సంబంధించి విస్తీర్ణాన్ని బట్టి ఇంటి పన్ను నిర్ణయిస్తారన్నారు. ప్రతి ఆరు నెలలకోమారు ప్రజలు పన్ను చెల్లిస్తున్నారని తెలిపారు. కొంత మంది విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా బకాయి ఉన్నారన్నారు. 1993 నుంచి కోట్ల రూపాయల్లో పన్ను బకాయి ఉందన్నారు. బకాయిలకు సంబంధించి రూ.14,26,32,031 చెల్లించాల్సి ఉండగా, దీని వడ్డీ రూ.10,72,04,518 చెల్లించాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బకాయిల చెల్లింపునకు సంబంధించి వడ్డీ రాయితీ ఇవ్వాలని జీఓ జారీ చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించి మున్సిపాలిటీ ఆదాయానికి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. వివిధ రకాల పన్నుల ద్వారానే మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.

అమృత్ పథకానికి 75 శాతం చెల్లించాం

ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందుకు రూ.120 కోట్లతో అమృత్ పథకాన్ని రూపొందించామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఇందులో 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుండగా మిగతా 75 శాతం డబ్బును మున్సిపాలిటీ చెల్లించిందని వివరించారు. అలాగే సుమారు రూ.100 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పార్కులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఈ నెల 31 లోపు చెల్లిస్తే ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

బద్వేలు అర్బన్ : ఈ నెల 31వ తేదీలోపు ఆస్తి, ఖాళీ జాగా పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన జీవో 34 ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలపై ఉన్న వడ్డీని, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని వన్‌టైం మేజర్‌గా మాఫీ చేయడం జరిగిందని, అయితే సంబంధిత యజమానులు ఈ నెల 31వ తేదీలోపు బకాయిల మొత్తాన్ని చెల్లిస్తేనే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. పన్ను బకాయిలు మున్సిపల్ కార్యాలయంలో గాని, ఆయా వార్డు సచివాలయాల్లో గాని చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా జ్యోతి ఉత్సవాలు


జ్యోతి ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని ప్రకాష్‌నగర్‌లోని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో 5వ వార్షికోత్సవాల సందర్భంగా శుక్రవారం ఘనంగా జ్యోతి ఉత్సవాలను నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి ప్రారంభమైన చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలు శుక్రవారం ఉదయం వరకు నిర్వహించారు. అమ్మవారి జ్యోతులను తలమీద ఉంచుకుని మంగళవాయిద్యాల సందడికి అమ్మవారి నామ స్మరణలు చేస్తూ భక్తులు నృత్యం చేశారు. ప్రకాష్‌నగర్‌లో అన్ని ప్రాంతాల్లో జ్యోతులను ఊరేగించారు. దారి వెంబడి భక్తులు కాయాకర్పూరాలను సమర్పించి మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సరస్వతి కోటంరాజు, కార్యదర్శి ధనలక్ష్మి, కోశాధికారి అలంకారం బాలాజీ రాజు, డాక్టర్ కాల్వ విజయనాగేంద్ర, డాక్టర్ సమిత, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య విషయాలపై శ్రద్ధ వహించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప అర్బన్: ప్రతి తల్లీ, గర్భిణులు ఆరోగ్య విషయాలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలియజేశారు. శుక్రవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఏఆర్‌టి సెంటర్‌లో సాథి అండ్ మ్యాన్‌కైండ్ ఫార్మావారి సౌజన్యంతో గర్భిణీలు, తల్లులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మందులు క్రమంగా వేసుకోవాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్య విషయాలపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.కే ఖాదర్‌వల్లి మాట్లాడుతూ ప్రతిరోజూ ఆహారంలో ఆకుకూరలు, పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అందరూ సమతుల్య ఆహారాన్ని తీసుకుని జీవనశైలిని పెంచుకోవాలని సూచించారు. డీపీఎం వి. భాస్కర్ మాట్లాడుతూ హెచ్ఐవి బాధితులు యోగా ఆచరించడం వలన చాలా ప్రయోజనాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ పి.వి ప్రసాద్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ భాగస్వామ్య ప్రతినిధులు పాల్గొన్నారు. సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ (సాథి)టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులందరూ పాల్గొని తల్లులకు, గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందజేయడంతో పాటు, వారికి సలహాలు,సూచనలు చేయడం అభినందనీయమన్నారు.